క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు

గోవిందరావుపేట: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్ వాసుదేవ రెడ్డి ఆధ్యక్షతన పస్రా జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షురాలుగా జ్యోతి, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాంకుమార్, కోశాధికారిగా మల్లారెడ్డి, కార్యదర్శులుగా తేజ, సరిత, ప్రవళిక, మల్లికార్జున్, సంతోష్ ఎన్నికైయ్యారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర కమిటీ మేరకు మంగళవారం పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, మాజీ ఎంపీపీ సుడి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు డాక్టర హేమాద్రి, నాంపూర్ణ చందర్, బాబర్, చందులాల్, రాణి, రమేశ్, చౌదరి, వెంకన్న, ఓదేలు, శ్యామ్, కనకయ్య, రఘువీర్, ప్రసాద్ ఉన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

గోవిందరావుపేట: రోడ్డు మీద పొగమంచు దట్టంగా వస్తున్న నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాత్రి సమయంలో, తెల్లవారుజామున, ఉదయం సమయంలో పొగమంచు అధికంగా ఉంటుందని తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉందన్నారు. లైట్లు, ఇండికేటర్లు సరిగా వెలుతురు వచ్చేటట్లు చూసుకోవాలన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని మహబుబ్‌పల్లితో పాటు, మండలంలోని గోర్లవీడులోని గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో 900 లీటర్ల చక్కర పానకం, 60లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోని ముగ్గురిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో భూపాలపల్లి ఎస్సై రబ్బానీ, సిబ్బంది శ్రీకాంత్, రఘుపతి, బాలకృష్ణ, సునీల్, ముజాఫర్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

కాటారం: మండలంలోని జాదారావుపేట గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఆత్మకూరి రాజయ్య హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఇప్పలిపల్లి నుంచి జాదారావుపేట చెరువు వరకు రహదారి నిర్మాణం, గూడూరు నుంచి విలాసాగర్ వరకు రోడ్డు నిర్మాణం, జాదారావుపేట చెరువు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరినట్లు రాజయ్య తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

శునకాల స్వైరవిహారం

తప్పని పందుల బెడద
- గాయాలపాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో పందులు, కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామంలోని వృద్ధులు, విద్యార్థులను గాయపరుస్తుండడంతో ఆస్పత్రుల పాలు అవుతున్నారు. స్థానికులు రోడ్ల వెంట వెళ్లాలంటే భయపడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పందులు, కుక్కలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జంపన్నవాగు కలుషితం

జంపన్నవాగులో పందులు దొర్లి కలుషిత నీటిగా మారుస్తున్నాయి. జంపన్నవాగు ఒడ్డు వెంట చికెన్, చేపల విక్రయదారులు వ్యర్థాలను అక్కడే పడవేయడంతో పందులు తీవ్రంగా రావడం వల్ల వ్యాధులు వస్తున్నాయని వాగు ఒడ్డు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమాదేవిని వివరణ కోరగా పందులు, కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, వాటిని అదుపు చేసేందుకు కావాల్సిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెత్తాచెదారం తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.


జంపన్నవాగుఒడ్డు వద్ద ఉన్న పందులు

ఇబ్బంది పడుతున్నాం..



జంపన్నవాగు ఒడ్డు వెంట వ్యర్థాలను పడవేయడంతో పందులు వస్తున్నాయి. అలాగే దుర్వాసన వస్తుంది. చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గ్రామ పంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– రాజయ్య, 8వ వార్డు, ఏటూరునాగారం

కుక్కలను నియంత్రించాలి



కుక్కలు పెరగకుండా కుటుంబ నియంత్రణ చేసి వాటి బెడదను లేకుండా చేయాలి. శునకాల సంఖ్య పెరిగిపోతుండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డు ఎక్కాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది చొరవ చూపాలి.

– గౌస్‌పాషా, 9వార్డు, ఏటూరునాగారం

ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి

- ఎండోమెంట్ పరకాల ఇన్‌స్పెక్టర్ నందనం కవిత


ఆలయ స్థలాన్ని గూగుల్‌లో పరిశీలిస్తున్న కవిత

ఏటూరునాగారం: రామాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని దేవాదాయ ధర్మాదాయశాఖ పరకాల ఇన్‌స్పెక్టర్ నందనం కవిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి గల భూములు, ఆలయం ఎంత విస్తీర్ణం ఉందని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆలయ చరిత్రను అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ కవితకు వివరించారు. ఆలయాన్ని దూప దీప నైవేద్యం స్కీంలో చేర్చాలని ఆలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్, కోశాధికారి దీనబాంధుస్వామి కోరారు. ఆలయ అభివృద్ధి కోసం సహకరించాలని ఆమెకు విన్నవించారు. అనంతరం ఆమెను ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు సన్మానించారు. అనంతరం ఫంక్షన్‌హాల్ నిర్మాణం పనులను పరిశీలించి మంచి కార్యక్రమం చేపట్టారని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సూర్యనారాయణశర్మ, ఇర్సవడ్ల సంతోష్, లక్ష్మీ, వీణారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

వాజేడు: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈ సర్వే ప్రారంభం కాగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సెల్‌ఫోన్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 8158 దరఖాస్తులను చేసుకోగా మంగళవారం ఒక్క రోజే మండల వ్యాప్తంగా 363 ఇళ్ల సర్వేను గ్రామ పంచాయతీ కార్య దర్శులు, సిబ్బంది పూర్తి చేశారు.


సర్వే చేస్తున్న అధికారులు

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రొసైడింగ్ ఆఫీసర్ వెంకటనారాయణ


మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఎస్ఎస్‌తాడ్వాయి: ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ప్రొసైడింగ్ ఆఫీసర్ వెంకటనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అవరణలో ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక బృందాలు నిర్వహించిన తనిఖీలలోని లోపాలను గ్రామపంచాయతీల వారీగా వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు వంద రోజులు ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. రూ.66310లను గ్రామ పంచాయతీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది నుంచి రికవ్రీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి సాంబయ్య, ఎంపీడీఓ సుమనవాణి, ఎస్ఆర్పీ రమేష్, ఏపీఓ అనీల్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కన్నాయిగూడెం: మండలంలోని పలు పాఠశాలల్లో రాష్ట్రీయ, బాల స్వస్తిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారికి అద్దాలు అందజేశారు. హెల్త్ కోర్డినేటర్ తిరుపతి, వైద్య బృందం నరహరి, సుజాత, కల్పన, ఫార్మసిస్టు భాస్కర్, రజిత, ప్రధానోపాధ్యాయులు గొలుసుల దయాసాగర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగు రూరల్: జాతీయ రహదారి పక్కన పండ్ల బండిని కారు ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. టీఎస్ 03ఎఫ్ఎఫ్ 0759 నంబరు గల కారు ఏటూరునాగారం వైపు నుంచి హనుమకొండకు వెళ్తుంది. ఈ క్రమంలో జిల్లాకేంద్రంలోని బస్టాండ్ దాటిన అనంతరం కారు అదుపుతప్పి రోడ్డుపై నడుచుకుంటు వెళుతున్న రాము, మోహన్‌లను ఢీ కొట్టింది. ప్రమాదంలో రాముకు తలకు గాయం కాగా, మోహన్‌కు కాలువిరిగింది. పండ్ల బండి నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108 సమాచారం అందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రెండవ ఎస్సై రామక్రిష్ణ సంఘటన స్థలానికి చేరుకొని కారు నడిపిన వ్యక్తి వివరాలను సేకరించారు.

నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్

జాతీయ రహదారికి ఇరుపక్కల పండ్లు, పూలు, మిర్చి బండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు రోడ్లపై వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఏటూరునాగారం: విద్యార్థులతో కరచలనం చేస్తున్న రామపతి


వాజేడు: క్రీడలను ప్రారభిస్తున్న తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్

- మండల ప్రత్యేకాధికారి రామపతి

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయి డీఎం రామపతి అన్నారు. సీఎం కప్ మండల స్థాయి క్రీడల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో క్రీడలను మండల ప్రత్యేకాధికారి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ మల్లయ్య, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, హెచ్ఎం సాంబశివరావు, కోచ్ పర్వతాల కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి

వాజేడు: క్రీడల్లో క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మంగళవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్ వీరభద్రప్రసాద్ ప్రారంభించి క్రీడలకు సంబంధించిన జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ క్రీడాకారుడు ఆటలు ఆడే సమయంలో తమలోని నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీఓ విజయ, ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.


ఎస్ఎస్ తాడ్వాయి: క్రీడకారులతో అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామీణ ప్రాంతం నైపుణ్యం కలిగిన క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ సుమనవాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవానికి ఎంపీడీఓ సుమనవాణి, ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక కావాలన్నారు. మండలంలో 18 గ్రామపంచాయతీలకుగాను 16 గ్రామపంచాయతీల నుంచి క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా స్పోర్ట్ ఆఫీసర్ యాలం ఆదినారాయణ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


ఫోన్ అందజేస్తున్న ఎస్సై సందీప్‌కుమార్

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం అందించారు. మండల కేంద్రానికి చెందిన రమేశ్ ఫోన్ పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశారు.

విద్యార్థినికి అభినందన

కాళేశ్వరం: మహదేవపూర్ మండల స్థాయిలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం(టీబీ ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో కాళేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కటుకు అలేఖ్య మొదటి బహుమతి సాధించినట్లు హెచ్ఎం అన్నపూర్ణ తెలిపారు. ఆ విద్యార్థికి పాఠశాలలో గైడ్ టీచర్ సువర్ణ మంగళవారం అభినందించి జ్ఞాపిక అందజేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో వృద్ధులకు చేగువేరా యూత్ సభ్యులు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ.. మండలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగిందన్నారు. వృద్ధులు ఇబ్బంది పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వనం శ్రీనివాస్, నెల్లి వేణు, బమ్మ రవీందర్, నేత సాయి కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

పాఠశాలలో ఎగ్జిబిషన్

టేకుమట్ల: మండలంలోని వెలిశాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం అగ్రి బెస్ట్ ప్రొడక్ట్‌లపై ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో వివిధ రకాల పూలు, పండ్లు, గింజలు, చిరుధాన్యాలను ప్రదర్శించారు. వాటి వినియోగం, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీడీఓ అనిత, మండల ప్రత్యేకాధికారి శైలజ, ఏఎస్సై కుమారస్వామి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రసాద్, వెంకట్రావుపల్లి ప్రధానోపాధ్యాయులు రమేశ్ పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

ఆహ్లాదం.. ఆకర్షణీయం

- అంకుషాపూర్‌లో ఆకట్టుకుంటున్న పార్క్
- ప్రత్యేక శ్రద్ధతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ

టేకుమట్ల: పల్లెల్లో పచ్చదనం నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంతో పల్లెల్లో పచ్చదనం నిండుకుంటోంది. గతంలో పట్టణాలలోనే పార్క్‌లు ఉండేవి, కాని గత రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో సైతం పార్క్‌లు ఏర్పాటు చేయాలనే కృషితో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగిస్తున్నాయి. అందులో భాగంగానే మండలంలోని అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనం టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డులో ఉండగా పార్క్‌లో సుమారు 20 రకాల మొక్కలను నాటగా ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మండలంలోనే ప్రత్యేక గుర్తింపు...

మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా అన్ని పల్లె ప్రకృతి వనాలు గ్రామాల్లో, గ్రామ సమీపాలల్లో ఏర్పాటు చేయగా అంకుషాపూర్ పల్లె ప్రకృతి మాత్రం గ్రామానికి సుమారు 3కిలో మీటర్ల దూరంలో టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన పార్క్ మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. వాహనదారులు కాసేపు పార్క్‌లో సమయాన్ని గడిపి వెళ్తున్నారు. స్వచ్ఛమైన వాతావరణం, విశాలమైన స్థలంలో గత సంవత్సరం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.


అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనం

నర్సరీలో ఎన్నో రకాల మొక్కలు..

పల్లె ప్రకృతి వనం పక్కనే నర్సరీని ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షిస్తూ, పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. సాధారణంగా పలు ప్రాంతాల్లో మొక్కలను కొనుగోలు చేసి జూన్‌లో వనమహోత్సవంలో మొక్కలను నాటుతుంటారు. కానీ పార్క్‌లోని మొక్కలను నుంచి మరికొన్ని మొక్కలను నర్సరీలో నాటుతూ మొక్కలను పెంచుతున్నారు. అలా ప్రత్యేకంగా పెంచిన పలు రకాల మొక్కలను ప్రజలకు అందిస్తుంటారు. దాంతో మొక్కలను కొనుగోలు చేసే ఖర్చు తగ్గిందని పార్క్ నిర్వాహకులు, అధికారులు తెలుపుతున్నారు. ఇలా అన్ని గ్రామాల్లో మొక్కలను పెంచుతూ గ్రామాల్లో నాటితే పచ్చని పల్లెలుగా రూపొందుతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పార్క్ నిర్వహణపై దృష్టి



అంకుషాపూర్ పల్లె ప్రకృతి వనంలో పలు రకాల మొక్కలను నాటి, నిత్యం వాటి ఎదుగుదలను పర్యవేక్షిస్తూ, వాటి సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాం. అందమైన పార్క్‌గా కొనసాగేందుకు వనసేవక్ సేవలు అభినందనీయం. అలాగే అందరి సహకారంతో పార్క్‌ను అందంగా తీర్చిదిద్దాం. మరికొన్ని రోజుల్లో మరిన్ని మొక్కలను నాటి మరింత అందంగా మార్చేందుకు కృషి చేస్తాం.

– బేతు కోమల, పంచాయతీ కార్యదర్శి, అంకుషాపూర్

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెం గ్రామ శివారుల్లోని వరి పొలం వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బర్లగూడెం గ్రామానికి చెందిన కళావతి పొలంలో ఉన్న కొయ్యాలను కాల్చివేస్తున్న సమయంలో పక్క పొలంలో ఉన్న వరి ధాన్యం వైపునకు మంటలు వెళ్లాయి. దీంతో మంటలను అదుపు చేసే క్రమంలో కళావతికి అంటుకోని తీవ్ర గాయాలైయ్యాయి. గమనించిన గ్రామస్తులు వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.